క్లుప్తంగా

మున్సిపల్ ఆర్వోగా వెంకటరెడ్డి



నంద్యాల(న్యూటౌన్): నంద్యాల మున్సిపల్ కార్యాలయ రెవెన్యూ ఆఫీసర్‌గా వెంకటరెడ్డి శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పని చేస్తున్న ఆంజనేయులు మార్కాపురం మున్సిపల్ మేనేజర్‌గా బదిలీ అయ్యారు. డోన్ మున్సిపల్ కార్యాలయం ఆర్వోగా విధులు నిర్వహిస్తున్న వెంకటరెడ్డిని నంద్యాల మున్సిపాలిటీకి ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఆయన్ను పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది అభినందించారు.

సెంట్రల్ వేర్ హౌస్‌లో తాగునీటి వసతి



తాగునీరు అందిస్తున్న ఎస్‌డీపీఐ నేతలు

నంద్యాల(అర్బన్): స్థానిక సెంట్రల్ వేర్ హౌస్‌లో జొన్న అమ్మకాల కోసం వచ్చే రైతుల దాహార్తిని తీర్చేందుకు ఎస్‌డీపీఐ ఉపక్రమించింది. ప్రతి రోజూ 30 వాటర్ క్యాన్లను ఏర్పాటు చేసి రైతులకు తాగునీరు అందిస్తున్నామని ఎస్‌డీపీఐ నంద్యాల అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ మజీద్‌ఖాన్ తెలిపారు. రైతుల అవస్థలను చూసి తమ వంతు బాధ్యతగా తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అక్తర్‌హుసేన్, షేక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్‌ను సక్రమంగా నిర్వహించాలి



సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

గోస్పాడు: ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న ఎంఆర్ఐ, సిటీ స్కానింగ్‌లను సక్రమంగా నిర్వహించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు అన్నారు. శనివారం నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో సూపరింటెండెంట్ మల్లేశ్వరికి వినతి పత్రం అందజేశారు. పేద రోగులు సీటీ స్కానింగ్ చేయించుకోవడానికి ప్రైవేటులో డబ్బులు లేక ప్రభుత్వాసుపత్రికి వస్తున్నారన్నారు. అయితే ఇక్కడ కూడా సీటీ స్కానింగ్ పని చేయడం లేదని సిబ్బంది చెబుతుండడంతో పేద రోగులకు శాపంగా మారిందన్నారు. ఈ విషయంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ మల్లేశ్వరిని అడగగా తమకు ఎలాంటి సంబంధం లేదని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



సుద్దమల్ల లక్ష్మీనరసింహ కంబగిరి స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఉయ్యాలవాడ : మండలంలోని సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, అభయాంజనేయస్వామి, లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు వేకువజామునే ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు లక్ష్మణస్వామి, కమలేష్‌శర్మ, అనంతయ్య, భాస్కరశర్మలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రతిభావంతులకు సత్కారం



కేజీబీవీ ఎస్‌ఓ జయమణిని సత్కరిస్తున్న జిల్లా కలెక్టర్

దొర్నిపాడు: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ రాజకుమారి, డీఈఓ జనార్దన్‌రెడ్డి శనివారం నంద్యాలలో సత్కారించి జ్ఞాపికలను అందజేశారు. కస్తూరిబా గాంధీ విద్యాలయం ఎస్‌ఓ జయమణి, డబ్ల్యూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దస్తగిరి, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 587 మార్కులు సాధించిన మహేశ్వరి, హెచ్‌ఎం శ్రీనివాసరావులను సత్కరించి ప్రశంసించారు.

బైక్‌పై నుంచి పడి ఇద్దరికి గాయాలు

రుద్రవరం: మండల పరిధిలోని రెడ్డిపల్లె గ్రామ సమీపంలో శనివారం మోటార్ సైకిల్ మీద నుంచి కింద పడి ఇద్దరు గాయపడ్డారు. నంద్యాలకు చెందిన మనోజ్, మరో వ్యక్తితో కలిసి మోటర్ సైకిల్‌పై అహోబిలం వెళ్లి తిరిగి వస్తుండగా రెడ్డిపల్లె సమీపంలో కుక్కలు అడ్డు రావడంతో వాటిని తప్పించే క్రమంలో అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు వారిని రుద్రవరంలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లి ప్రథమ చికిత్సలు చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



గుండుపాపలలో వానకు తడిసి ముద్దయిన మిర్చి



మాయలూరు, అల్లూరు గ్రామాల మధ్య నేలవాలిన వరి

గాలీవాన బీభత్సం

- విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలు
- మిరప రైతులను ముంచెత్తిన వాన
- కల్లాలో తడిసిన దిగుబడులు

దొర్నిపాడు: మండల పరిధిలో శనివారం గాలీవాన బీభత్సం సృష్టించింది. ఒక్కసారిగా వాతావరణంలో మేఘాలు కమ్ముకొని భారీ ఎత్తున గాలి వీయడంతో విద్యుత్ స్తంభాలు ఎక్కడికక్కడే విరిగిపడ్డాయి. ఇక కల్లాల్లో ఆరబోసిన మిరప పంటను వాన ముంచెత్తింది. బలమైన గాలివానకు పంటపై కప్పిన పట్టలు లేచిపోయాయి. ఒక వైపు మిరప పంటకు ధరలు పడిపోవడంతో ఇబ్బందుల్లో ఉన్న మిర్చి రైతులు ప్రకృతి కూడా తను కరుణించడం లేదని వాపోతున్నారు. అమ్మిరెడ్డినగరం, దొర్నిపాడు, చాకరాజువేముల, బుర్రారెడ్డిపల్లె, డబ్ల్యూ కొత్తపల్లె గ్రామాల్లో సుమారు 40 స్తంభాలు విరిగిపడ్డాయి. వెంటనే ఆశాఖ ఏడీ సతీష్‌కుమార్‌రెడ్డి, ఏఈ అనంతరావు వెంటనే విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు.



దొర్నిపాడులో వడగండ్ల వాన

వదలని వర్షం..

ఉయ్యాలవాడ : మండలంలో మూడు రోజులుగా అకాల వర్షం కురుస్తూనే వుంది. రబీలో సాగు చేసిన వరి పంటలు దెబ్బతింటున్నాయి. గురు, శుక్ర, శనివారాల్లో రోజు సాయంత్రం అయ్యే సమయానికి ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన బీభత్సానికి రైతులు లబోదిబోమంటున్నారు. మండల పరిధిలో కుందూనది తీరం వెంట 14 గ్రామాల్లో 852 హెక్టార్లలో వరి పంట సాగు చేశారు. సుమారు 250 హెక్టార్లకు పైగా పంట నేలవాలడంతో రైతులు కుదేలయ్యారు. కంకి దశలో వున్న వరి నేలవాలగా పైరుపై వచ్చే దిగుబడులు దెబ్బతింటాయని రైతుల్లో భయాందోళన నెలకొంది. పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితులు లేవని తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని అల్లూరు, మాయలూరు, ఉయ్యాలవాడ, ఆర్.జంబులదిన్నె, తదితర గ్రామాల రైతులు వాపోయారు. ప్రభుత్వం స్పందించి వరి రైతులను ఆదుకోవాలని కోరారు.



అమ్మిరెడ్డినగరంలో నేలవాలిన ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు



గోస్పాడు-జిల్లెల్ల రహదారిలో కూలిన చెట్లు

- నేలకొరిగిన చెట్లు, కూలిన విద్యుత్ స్తంభాలు

గోస్పాడు: మండలంలో శుక్రవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. పలు గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. యాళ్లూరు, ఎం.కృష్ణాపురం గ్రామాల పరిధిలో అత్యధికంగా వ్యవసాయ కనెక్షన్లకు సంబంధించిన సుమారు 100 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. రూ.15లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు విద్యుత్ అధికారులు చెబుతున్నారు. యాళ్లూరు, ఎం.కృష్ణాపురం, బీవీనగర్, శ్రీనివాసపురం, సత్యనారాయణపురం గ్రామాల్లో శుక్రవారం రాత్రి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ప్రజలు చిమ్మచీకట్లో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అలాగే గోస్పాడు నుంచి జిల్లెల్లకు వెళ్లే రహదారి, యాళ్లూరు నుంచి ఎం.కృష్ణాపురం వెళ్లే దారి, జిల్లెల్ల నుంచి యాళ్లూరుకు వెళ్లే దారిలో చెట్లు నేలకొరిగాయి. రాత్రి సమయం కావడంతో అటువైపు వెళ్లే వాహనదారులు అవస్థలు పడుతూ వెనుదిరిగి ఇతర మార్గాల మీదుగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.



యాళ్లూరు-ఎం.కృష్ణాపురం రహదారిపై..



యాళ్లూరు సమీపంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

అసంబంధ విధానాలకు వ్యతిరేకంగా నిరసన

నంద్యాల(న్యూటౌన్): పాఠశాల విద్యలో అసంబంధ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 5వ తేదీ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివయ్య, అధ్యక్షుడు రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రాథమికోన్నత పాఠశాలలో 6, 7 తరగతులు ఉన్నచోట నాలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 6, 7, 8 తరగతులు ఉన్న చోట 6 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను జీఓ నం.55 ప్రకారం కొనసాగించాలన్నారు. బదిలీలు, పదోన్నతులకు మాన్యువల్ కౌన్సెలింగ్ విధానాన్ని కొనసాగించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని పేర్కొన్నారు. 12వ పీఆర్సీని నియమించి 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఏపీటీఎఫ్ సభ్యులు జాకీర్ హుసేన్, మధు, రమేష్‌బాబు, శ్రీనివాసులు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

8 నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



గోవిందపల్లె గ్రామంలో పునర్నిర్మించిన ఉమామహేశ్వర స్వామి ఆలయం

ఉయ్యాలవాడ : మండలంలోని గోవిందపల్లె గ్రామంలో రూ. కోటి వ్యయంతో పునర్నిర్మించిన ఉమామహేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు మూడు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 8న గోపూజ, గంగానయనం, గణపతిపూజ, పుణ్యావహచనం ప్రధాన కలశ స్థాపనలు, మృత్యంగ్రహణం, అగ్ని ప్రతిష్ఠాపనం, శాంతి హోమం ఉంటాయన్నారు. 9న ప్రాతఃకాల పూజనం, గ్రామోత్సవం, ధ్వజప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, ధాన్యాధివాసం, నవగ్రహ, గణపతి, రుద్రహోమములు, 10న ప్రాతఃకాలపూజ, యంత్రార్చన, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం, మహా పూర్ణాహుతి, గిరిజా కళ్యాణం, యజమానాశీర్వచనం నిర్వహించనున్నట్లు వెల్లడించారు..

8,9 తేదీలలో భజన, రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు

ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా 8వ తేదీన భజన పోటీలు నిర్వహించనున్నారు. మొదటి బహుమతి రూ. 30 వేలు, మొదలుకుని 17 బహుమతులు అందజేయనున్నారు. ఎంట్రీ ఫీజు రూ. 500లు చెల్లించాలన్నారు. అలాగే 9న రాష్ట్ర స్థాయి ఎడ్ల బండలాగుడు నిర్వహించి విజేతలకు వరుసగా రూ. 80 వేలు, రూ. 70 వేలు, రూ. 60 వేలు, రూ. 50 వేలు, రూ. 40 వేలు, రూ. 30 వేలు, రూ. 20 వేలు, రూ. 15 వేలు, రూ. 10 వేలు చొప్పున అందజేయనున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 9న ఆరు గంటలకు రూ. 500లు ప్రవేశ రుసుము చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

సయ్యద్‌బాషా మృతి పార్టీకి తీరని లోటు

చాగలమర్రి: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త, పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ, కష్టపడి పనిచేసే కార్యకర్త సయ్యద్‌బాషా (40) అనారోగ్యంతో మృతి చెందడం పార్టీకి తీరని లోటని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. శనివారం ఆయన చాగలమర్రికి చేరుకొని సయ్యద్‌బాషా మృత దేహాన్ని సందర్శించి, పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నాలుగేళ్ల క్రితం సయ్యద్‌బాషా సతీమణి ముబారక్ గుండెపోటుతో మరణించింది. సయ్యద్‌బాషా దంపతులకు నలుగురు పిల్లలు కాగా వారిలో పెద్దకుమారుడు ఫరీద్ 10వ తరగతి ఉత్తీర్ణుడయ్యాడు. కుమార్తెలు సమీర, రెహెనా, సాదియాలు చిన్న పిల్లలు కావడంతో తాతయ్య మాబూ షరీఫ్ సంరక్షణలో ఉన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధానకార్యదర్శి షేక్.బాబులాల్, వ్యాపార వేత్తలు చక్రం ముల్లా షబ్బీర్ అహ్మద్, షేక్.నాయబ్‌రసూల్, వైస్ ఎంపీపీ ముల్లా రఫీ, పార్టీ ఉపాధ్యక్షుడు ముల్లా ఖాదర్‌బాషా, జిల్లా మైనారిటి సెల్ అధ్యక్షుడు షేక్.షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.



చాగలమర్రిలో అనారోగ్యంతో మృతి చెందిన సయ్యద్‌బాష మృత దేహం వద్ద నివాళులర్పిస్తున్న గంగుల బ్రిజేంద్రారెడ్డి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రుద్రవరం: వేసవి కాలం ముగిసే వరకు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వరప్రసాదు సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలంలో అధికంగా శుభకార్యాలు ఉంటాయని, విద్యార్థులకు సెలవులు కావడంతో కుటుంబ సభ్యులు ఊళ్లకు వెళ్తుంటారన్నారు. అలాగే ఇళ్లల్లో ఉక్క పోతలు అధికంగా ఉంటుండటంతో అధిక శాతం ప్రజలు ఆరుబయట నిద్రిస్తుంటారని చెప్పారు. అలాంటి సమయాల్లో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇందులో భాగంగా ఇళ్లకు తాళాలు వేసుకోవాలని, నగదు, బంగారం ఇతర విలువైన వస్తువులు ఉంటే ఇళ్లల్లో ఉంచుకోకుండా బ్యాంకుల్లో లేదా మరో చోట భద్ర పరచుకోవాలని సూచించారు. అలాగే దేవాలయాల్లో విలువైన వస్తువులు, హుండీల్లో నగదు ఉంచకుండా ప్రతిరోజూ తీసి భద్ర పరచుకోవాలని సూచించారు.

పెద్దమ్మ దేవరకు పూర్తి సహకారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

దొర్నిపాడు: పెద్దమ్మ దేవరకు తమ నుంచి పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఆర్‌డీఓ విశ్వనాథ్ అధ్యక్షతన డబ్ల్యూ గోవిందిన్నెలో జూన్ 8,9,10న జరిగే మూలపెద్దమ్మ దేవర ఉత్సవాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడూ దేవర ఉత్సవాలు విజయవంతం కావాలంటే గ్రామస్తులు, అధికారులు, పోలీసులు ఎవరి పనులు వారు బాధ్యతగా నిర్వహించాలన్నారు. అనంతరం విద్యుత్, ఆర్టీసీ, పోలీసులు, పారిశుద్ధ్యం, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యం, లైటింగ్స్, పార్కింగ్ అధికారులకు ఆర్డీఓ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుభద్ర, ఆలయ కమిటీ సభ్యులు తలారి శ్రీనివాసులు, చిన్నన్న, శంకరయ్య, చిన్నపెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సత్కారం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని గురురాజ స్కూల్ విద్యార్థి నర్సిరెడ్డిని శనివారం జిల్లా కలెక్టర్ రాజకుమారి, జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి సత్కరించారు. పదో తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 597 మార్కులు సాధించడంతో అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ ఫలితాలను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులో మరెన్నో ర్యాంకులు సాధించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు షేక్షావలిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల- బనగానపల్లె ఆర్ అండ్‌బీ రహదారిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు.. మండలంలోని సౌదరదిన్నెకు చెందిన దస్తగిరి తెల్లవారుజామున టీ తాగేందుకు కోవెలకుంట్లకు వచ్చాడు. తిరిగి ఇంటికి నడుచుకుంటూ వెళుతుండగా పట్టణ శివారులోని డిగ్రీ కళాశాల సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం నంద్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాద ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో సర్వేయర్‌కు గాయాలు

కొలిమిగుండ్ల: మహిళా సర్వేయర్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. అంకిరెడ్డిపల్లె సచివాలయ పరిధిలో ఆదిలక్ష్మి సర్వేయర్‌గా పనిచేస్తున్నారు. శుక్రవారం తుమ్మలపెంటలో భూముల రీసర్వే చేశారు. సాయంత్రం కొలిమిగుండ్ల తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి సర్వేకు సంబంధించి పనులు ముగించుకున్నారు. ఏడున్నర గంటలకు స్కూటర్‌పై తాడిపత్రికి బయలుదేరారు. ఎనిమిదిన్నర గంటల సమయంలో బుగ్గ దాటాక గద్దరగుట్టపల్లె వద్దకు చేరుకోగానే గాలులు వీయడంతో స్కూటర్ అదుపు తప్పి కింద పడింది. ఈ ప్రమాదంలో ఆమె కాలికి తీవ్రగాయమైంది. స్థానికుల సాయంతో కుటుంబ సభ్యులు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా సర్జరీ చేశారు.

తిరునాలను దేవదాయశాఖ నిర్వహిస్తుంది

అవుకు: ఏటా అవుకులో జరిగే చెన్నకేశవస్వామి తిరుకల్యాణ మహోత్సవాలను ఈ ఏడాది దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆలయంలో రైతు సంఘం పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇది వరకు రైతు సంఘం ఆధ్వర్యంలో తిరునాల జరిగేదని, ఇక నుంచి రైతు సంఘం రూపాయి ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదన్నారు. మొత్తం దేవదాయశాఖ భరిస్తుందని తెలిపారు. త్వరలో తిరునాలకు సంబంధించి కమిటీ నియమిస్తామని చెప్పారు.

నేడు గంగ జయంతి

బనగానపల్లె రూరల్: మండలంలోని పలుకూరు రామేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గంగ జయంతి నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు భాస్కరయ్య శనివారం తెలిపారు. ఈ సందర్భంగా 108 కలశాలతో జలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

కుమారస్వామికి పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో షష్టిని పురస్కరించుకుని శనివారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

రాజధానికి నిధులేవీ



సమావేశంలో మాట్లాడుతున్న రంగనాయుడు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర రాజధానికి నిధులు లేకుండా చాక్లెట్‌తోనే ప్రధాన మంత్రి సరిపెట్టారని.. నిధులు మంజూరు చేసుకోవడంలో ముఖ్యమంత్రి విఫలమయ్యారని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ విమర్శించారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ 2014లో రాజధాని శంకుస్థాపనకు వచ్చినప్పుడు గుప్పెడు మట్టిని..గ్లాస్ నీరు ఇచ్చి వెళ్లారని గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు మోదీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు చాక్లెట్ ఇచ్చి సరిపుచ్చడం వల్ల రాష్ట్రాభివృద్ధి ఏ మాత్రం జరుగుతుందని ప్రశ్నించారు. కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి మోదీని రాష్ట్రానికి పిలిపించి హామీలు తీసుకోకుండా రాజధానికి వేల మందిని పిలిచి సభలు ఏర్పాటు చేయడం వల్ల ఏం ఉపయోగమని పేర్కొన్నారు. రాజధాని శంకుస్థాపనకు బస్సులు తరలివెళ్లడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కేంద్రం రాజధానికి నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా నాయకులు శ్రీనివాసులు, నాగరాముడు తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవంలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి నాగరాముడు, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నంద్యాల సాయిబాబానగర్‌లోని సీపీఐ కార్యాలయం ఎదుట ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రంగనాయుడు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, నిరుద్యోగ యువతకు అండగా ఉండాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు విష్ణు, మధు, అంజి, రవి, పాములేటి పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కలిసికట్టుగా పని చేద్దాం

ఆళ్లగడ్డ : మండల అభివృద్ధికి అందరం కలిసికట్టుగా పనిచేద్దామని ఆళ్లగడ్డ ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో శనివారం సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా అవసరమైన మేర చర్యలు తీసుకోవాలన్నారు. అసంపూర్తిగా మిగిలిపోయిన నిర్మాణ పనులను పూర్తి చేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలని మండల ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పంచాయతీ అధికారులు గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి వైఎస్సార్‌సీపీకి చెందిన స్థానిక ఎంపీటీసీ, సర్పంచులకు కనీస సమాచారం కూడా ఇవ్వకపోవడం ఎంతవరకు సబబన్నారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు తమ పరిధిలోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. మర్రిపల్లె గ్రామంలో శ్మశాన వాటికలో సమస్యలు ఉన్నాయని గ్రామ సర్పంచ్ సూచన మేరకు మండల నిధుల నుంచి రూ 2 లక్షలు విడుదల చేస్తే సర్పంచ్ వైఎస్సార్‌సీపీ వారు అని ఆ పనులను చేపట్టకుండా సంబంధిత సెక్రటరీ నిలుపుదల చేయించడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటివి వేరే గ్రామాల్లో జరుగకుండా ఎంపీడీఓ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహబూబ్ ఖాన్, తహశీల్దార్ రత్నకుమారి ఉన్నారు



మాట్లాడుతున్న ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి

గొడవలకు దూరంగా ఉంటే జీవితం ప్రశాంతం



నాయకులతో మాట్లాడుతున్న ఫ్యాక్షన్ జోన్ సీఐ ప్రభాకర్‌రెడ్డి

కొలిమిగుండ్ల: గ్రామాల్లో గొడవలకు పోకుండా అందరూ ప్రశాంతంగా ఉండాలని ఫ్యాక్షన్ జోన్ సీఐ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. శనివారం స్థానిక సీఐ రమేష్‌బాబుతో కలిసి పెట్నికోట, గొర్విమానుపల్లె, అంకిరెడ్డిపల్లె, చింతలాయిపల్లె తదితర గ్రామాల్లో పర్యటించారు. నాయకులు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. గొడవలకు పాల్పడి కుటుంబాలను నాశనం చేసుకోవద్దన్నారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించుకుని వారి ఉన్నతికి కృషి చేయాలని సూచించారు. చిన్న విషయాలకు అల్లర్లకు పాల్పడడం, ఘర్షణకు దిగడం చేయరాదని పేర్కొన్నారు. ఏవైనా సమస్యలుంటే పోలీస్ స్టేషన్‌లో పరిష్కరించుకోవాలన్నారు. హెడ్‌కానిస్టేబుల్ స్వామినాయక్ తదితరులు ఉన్నారు.

సమ్మెను జయప్రదం చేద్దాం

నంద్యాల(న్యూటౌన్): కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మే 20వ తేదీ జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సాలయ్య పేర్కొన్నారు. శనివారం వారు మాట్లాడుతూ.. కార్మికులు చాలిచాలని జీతాలతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్మికులకు కనీస వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించాలని డిమాండ్ చేశారు.